
# వలస

రాజ్ శ్రీనివాస్



నా కా ఊరంటే నే భయం. ఊళ్ళో అడుగు పెట్టేవరకూ అక్కడ మనిషనే వాడుండడనీ, ఒక వేళ ఉన్నా చాలా తక్కువమంది ఉంటారనీ, అక్కడ భోజనం దొరకదనీ, వండుకు తినాలనీ, ఉద్యోగస్తులకి అదొక పనిష్మెంట్ ప్లేస్ అనీ, ఆ ఊరినించి బయటి ప్రపంచం చూడాలంటే ఐదారు గంటలు పడుతుందనీ అక్కడ ఇళ్ళేవీ లేవనీ- ఉద్యోగస్తులంతా ఆఫీసులోనే పడుకుంటారనీ, ఇలా రకరకాలుగా అనుకుంటుండే వాణ్ణి. అయితే ఊళ్ళో అడుగు పెట్టగానే నా అభిప్రాయం కొంత మారింది.

అక్కడ నాగరికపు ప్రపంచానికి దూరంగా సముద్ర మట్టానికి నాలుగు వేల అడుగుల ఎత్తున్న ఆ ఊళ్ళో ఓ డిగ్రీ కాలేజీ, ఓ పాలిటెక్నిక్కూ, రెండో మూడో ఇంజనీరింగు ఆఫీసులూ, ఇంకా రెండో మూడో కార్పొరేషన్ ఆఫీసులూ- ఇలా ఎక్కడచూసినా కాఫీ హొటళ్ళూ, రెండు వీడియో పార్లర్లూ, అంతా సందడిగా ఉంది. కొండదిగి నాగరిక ప్రపంచంలో పడ్డానికి ప్రతిగంటకీ ఒక బస్సుంది.

మొత్తానికి ఎన్ని భయాలున్నా అనుమానాలున్నా ప్రమోషను మీద వచ్చేను 'కాబట్టి, అదీ చాలా కాలంగా ఎదురుచూస్తున్నదీ అవడం వల్ల జాయినై పోయాను. శలవు పెట్టి మూటాముల్లే సర్దుకుని వద్దామని ఇంటికి వెళ్ళేసరికి మా పెద బావమరిది మూర్తి వచ్చి ఉన్నాడు. అతనికి నా సమర్థత మీద కొంచెం అప నమ్మకం. అతను కంట్రాక్టులవీ చేసి బాగా సంపాదించాడు. నేను తలొంచుకు పనిచేసుకు పోవడం తప్ప, ఏదీ పట్టించుకోననీ, అస లీ పాటికే ప్రమోషను రావాలనీ, నా అశ్రద్ధ వల్లే ఇంతాలస్యం అయిందనీ అతని నమ్మకం.

మా ఆవిడక్కూడా నమ్మకం మామూలప్పుడు ఉన్నా అత నొచ్చినప్పుడు రెట్టింపవుతుంది. వెళ్ళగానే యథావిధి పలకరింపులవీ అయ్యాక, రాత్రి భోజనాల దగ్గర "బావా ప్రమోషనొచ్చింది బాగానే ఉందిగానీ, మరీ ఆ ఏజెన్సీయే దొరికిందా మీకు, ఇంక ఊళ్ళేవీ లేవా" అన్నా డతను.

"మీ బావ సంగతి తలొంచుకు పోవడం తప్ప ఏనాడైనా మా కష్టం, సుఖం పట్టించుకున్నారు గనకనా?" అని వెనకాల దీర్ఘం తీసింది మా ఆవిడ.

"ఇప్పుడేవయిందీ?" అన్నాను కొంచెం విసుగ్గా.

"అది కాదు బావా, మీరింత మెతగ్గా ఉంటే లాభం లేదు. నెగ్గుకు రాలేరు. ఈ రోజుల్లో కొంచెం తెగింపు కావాలి. మీరు వెంటనే సెలవు పెట్టి ట్రాన్స్‌ఫర్‌కి ట్రై చెయ్యండి. మీకు ఏజెన్సీ పడుతుందో, లేదో. ఎందుకొచ్చింది? పిల్లల చదువులు మధ్యలో ఉన్నాయి. ఫ్యామిలీ షిఫ్ట్ చెయ్యడం కుదరదు. అందరూ ఇక్కడుంటే మీరొక్కరూ అక్కడుండాలి" అన్నాడు మూర్తి.

"ఒరే తమ్ముడూ, ఆయనకిదేఁవీ పట్టదుగానీ ట్రాన్స్‌ఫర్ ఏదో కొంచెం నువ్వు చూద్దూ" అని నా కేసి తిరిగి-"మీరు మళ్ళీ వెళ్ళి సెలవు పొడిగించి రండీ" అంది.

ఆ తర్వాత మూర్తి నా అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ట్రాన్స్‌ఫర్ ఏర్పాట్ల గురించి ఎవర్ని కలవాలో, ఏం చెయ్యాలో వివరించేడు.

మర్నాటి నించీ సెలవు పొడిగించి ట్రాన్స్‌ఫర్ గురించి తిరగడం మొదలెట్టాం. మర్నాడే ఓ ఛోటా రాజకీయ నాయకుణ్ణి పరిచయం చేసి, రోజూ అతన్ని కలవమని చెప్పి మూర్తి ఊరు వెళ్ళిపోయాడు.

రోజూ పొద్దున్నా సాయంత్రం అతని వెనకాల తిరగడం ఇదంతా చాలా చికాకు అనిపించినా, నెల రోజులు రాజకీయ నాయకుడి వెనకాల తిరిగేను. ఏమీ ప్రయోజనం కనుపించలేదు. ట్రాన్స్‌ఫర్‌ల విషయంలో ఎప్పుడూ ప్రయత్నించక పోవడం వల్ల అందులో ఇంత కష్టం ఉందని నాకు తెలీదు. రోజూ అతనెవరికో ఫోన్ చెయ్యడం,వాళ్ళు చూస్తామనో, మరేదో చెప్పడం, ఎవర్నెవర్నో కలవడం.... కాఫీలు, డ్రింకులూ, ఆటో ఛార్జీలు....తప్ప మరింకేమీ పని జరగలేదు.

మరో పది రోజులు గడిచిం తర్వాత ఆయన నెమ్మదిగా సెలవిచ్చాడు.

"చూడండి రావుగారూ, మీ పనవాలంటే ఓ ఐదువేలు ఖర్చవుతుందండీ ఇంతకు ముందు సులువుగా అయిపోయేవండీ, ఇప్పుడు కొంచెం కష్టం అవుతుందండీ. పైగా ఎక్కడా వేకెన్సీ లేదు. మీ కోసం ఏదో ప్లేస్ క్రియేట్ చెయ్యాలి. అదీ విషయం. అంచేత నాలుగయిదు రోజుల్లో మీరు డబ్బు తెస్తే మీ పని అయిపోయినట్లే" అన్నాడు.

ఒక్కసారే నా గుండెల్లో రాయిపడి నట్లయింది. ఐదు వేలంటే కొంచెం ఎక్కువే. ఇరవై సంవత్సరాల ఉద్యోగంలో సంపాదించిందేముందీ, మంచి పేరు తప్ప! పిల్ల పెళ్ళికని నెల నెలా కొంత సేవింగ్స్‌లో దాస్తోంది తప్ప, మరింకేవీ లేదు. అందులోది తీసి వాడితే తర్వాతెవర్ని అడగడం? మళ్ళీ కలుస్తానని చెప్పి ఇంటి కొచ్చేసేను కానీ ఏం చెయ్యడఁవా? అన్న ఆలోచన న న్నొదల్లేదు. మూర్తిని సలహా అడిగితే ఐదు వేలిచ్చి ట్రాన్స్‌ఫర్ చేయించుకోమనే చెప్తాడు. రెండు రోజుల్లో సెలవు కూడా అయిపోయింది. కానీ నేనేవీ తేల్చుకోలేదు.

"మరింకెందుకు, ముందు వెళ్ళి చేరి పోయి కంటిన్యూ అవుతూ అంతగా ఇబ్బంది అయితే అప్పుడు డబ్బులిచ్చి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చు.' అనుకుంటూ వెళ్ళి డ్యూటీలో చేరి పోయేను.

సాయంకాలం ఆఫీసయి పోయేక, ఊరు మధ్యకి నడిచేను. ఓ చిన్న టీ బడ్డీ లోంచి 'ఆజారే పరదేశీ' అన్న పాట వినిపిస్తోంది. అడుగులు నెమ్మదిగా అటు నడిచాయి. ఎప్పటి పాట...లతా మంగేష్కర్ కంఠంలో కొన్ని క్షణాలు ప్రపంచాన్ని మరిచిపోయేను.

"సాబ్ టీ చెయ్య మంటారా?" అన్న కంఠం వినిపించి పక్కకి తిరిగిచూసేను.

పద్దెనిమిది, ఇరవై ఏళ్ళ కుర్రాడు బడ్డీలో కెళ్తున్నాడు.

"చెయ్" అన్నాను.

టీ తయారు చేసిచ్చాడు. టీ చాలా బావుంది.

అప్పుడు పరీక్షగా చూసేనతన్ని. ఈ ప్రాంతం వాడు కాదు.

"ఏవోయ్ ఎక్కణ్ణుంచి వచ్చావు?" అన్నాను.

"రాజస్థాన్" అన్నా డా కుర్రాడు.

"సు వ్వొక్కడివేనా?".

"లేదు సాబ్. ముందు నేనొచ్చా, తర్వాత వ్యాపారం బావుందని మా వాళ్ళు కొందరు వచ్చారు"అన్నాడు కొద్దిగా యాసగా.

డబ్బు లిచ్చేసి నడిచెళ్తుంటేనా సమస్యకి సమాధానం దొరికింది.ఎక్కడి రాజస్థాన్, ఎక్కడ కొండల మధ్య ఈ ఊరు? వందల మైళ్ళ దూరంనించి బతుకుకోసం.

మర్నాడే మూర్తికి ట్రాన్స్‌ఫర్ ట్రయల్స్ వద్దని రాసేసి ఊపిరి పీల్చుకున్నాను. ✱